క్లుప్తంగా

స్నేహితుల కుటుంబాలకు అండ



నగదు అందిస్తున్న మిత్రులు

తొగుట(దుబ్బాక): ఆపదలో ఉన్న చిన్ననాటి మిత్రులకు అండగా నిలిచి మానవత్వంచాటుకున్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో సిరిసిల్ల రాజేశం అనారోగ్యంతో ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న 1991–92 పదో తరగతి మిత్రులు కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే తొగుటలో భర్తను కోల్పోయిన లక్ష్మికి రూ.20 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న తమ చిన్ననాటి మిత్రుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జప్తిలింగారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ చిలువేరి రాంరెడ్డి, తొగుట రామచంద్రారెడ్డి, లింగాపూర్ రాములు, జూపల్లి నర్సింహులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



ఫోన్లు అందుకున్న వారితో సీఐ రవికుమార్

గజ్వేల్‌రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను తిరిగి బాధితులకు అప్పగించామని సీఐ రవికుమార్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో సుమారు రూ.1.80 లక్షల విలువ చేసే మొత్తం 12 సెల్‌ఫోన్‌లను మంగళవారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా పూర్తి వివరాలను సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుంటే ఎక్కడుందో కనిపెట్టవచ్చని చెప్పారు. వీలైనంత త్వరగా ఆ ఫోన్లకు సంబంధించిన వివరాలను సేకరించి బాధితులకు అప్పగిస్తామని తెలిపారు.

దుబ్బాకలో...



దుబ్బాకరూరల్: ఫోన్లు అందజేస్తున్న ఎస్‌ఐ

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్, లచ్చపేట, పెద్దగుండవెళ్లి, రామక్కపేట, చీకోడ్, బల్వంతాపూర్ గ్రామాలకు చెందిన రాములు, ప్రవీణ్, ఎల్లారెడ్డి, షాపూర్, నగేశ్, శ్రీనివాస్, అఫ్జల్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి ఎస్‌ఐ కీర్తి రాజు బాధితులకు అందజేశారు.

పూర్తయిన రైల్వే బ్రిడ్జి మరమ్మతులు

నెల రోజుల అనంతరం
మెదక్ రైల్వే పునఃప్రారంభం



బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్న అధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని శమ్నాపూర్ శివారులో ఆగస్టు 28న కురిసిన భారీ వర్షాలకు రైల్వేబ్రిడ్జి కొట్టుకుపోయిన విషయం తెల్సిందే. దీంతో గత కొంత కాలంగా బ్రిడ్జి మరమ్మతులు చేసేందుకు భారీ వర్షాలు కురుస్తుండటంతో పనులకు అంతరాయం ఏర్పడగా ఎట్టకేలకు పనులు పూర్తి చేసి బుధవారం నుంచి మెదక్ రైల్వే రాకపోకలు కొనసాగించనున్నారు. ఈ మేరకు రైల్వే అధికారులు మంగళవారం విలేకరులకు తెలిపారు.

ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నర్సాపూర్: ఎస్సీ ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించాలని ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేవేళ్ల డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. అలాగే ఎస్సీ ఉపకులాలకు ఆర్‌డీఓ నుంచి కాకుండా తహసీల్దార్ నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌డీఓ నుంచి సర్టిఫికెట్లు పొందాలంటే మూడు నెలలు పడుతుందని, దీంతో చాలా మంది ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదాయ మార్గాలపై అన్వేషణ

మున్సిపల్‌కు సాధారణంగా వచ్చే వనరులే కాకుండా అదనపు ఆదాయ మార్గాల వైపు మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. సాధారణ నిధులు మున్సిపల్ నిర్వహణ, కార్మికుల జీతాలకే సరిపోవడం లేదని.. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని అధికారులు చెప్తున్నారు.

మున్సిపల్‌లో రాబడి తక్కువ.. ఖర్చు ఎక్కువ

- నెలవారీ ఆదాయం కోసం ప్రణాళికలు
- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు పథకం
- రూ.4 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

హుస్నాబాద్: హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులు ఉన్నాయి. ఇంటి, నల్లా పన్నులు అలాగే వాణిజ్య, ట్రేడ్ లైసెన్స్‌లు, అంగడి నిర్వహణ ఇలా పన్నుల రూపంలో మున్సిపల్‌కు ప్రతియేటా దాదాపు రూ.1.42 కోట్లు ఆదాయం వస్తోంది. చెత్త సేకరించే వాహనాలకు డీజిల్ ఖర్చులు, వీధిలైట్ల విద్యుత్ బిల్లులు తలకు మించిన భారమవుతుంది. నెల తిరిగే సరికి నిధుల కోసం అన్వేషణ ప్రారంభించాల్సిన పరిస్థితి. ప్రభుత్వం షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాల కోసం రూ.4 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే పాత మున్సిపల్ ఎదుట 16 గదుల షాపింగ్ కాంప్లెక్స్‌తోపాటు మల్లెచెట్టు చౌరస్తాలో 18 గదుల షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వీటి నుంచి ప్రతినెల అద్దె గదుల కిరాయి వస్తుంది.

మరో రెండు చోట్ల..

అదనపు ఆదాయ వనరులు పెంచుకునే దానిలో భాగంగా మరో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం పాత తహసీల్దార్ కార్యాలయ స్థలం, దేవత బావి వద్ద ఉన్న మున్సిపల్‌కు చెందిన స్థలంలోను కొత్తగా రెండు షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేపట్టాలని మున్సిపల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ రెండు చోట్ల దాదాపు 30 గదులతో షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించనున్నారు.

పట్టణంలో ఇప్పటికే కొన్ని ప్రభుత్వశాఖలు అదనపు ఆదాయం కోసం షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించి ఆదాయం సమకూర్చుకుంటున్నారు. పోలీస్, ఆర్టీసీ, సింగిల్ విండో శాఖలు ఆదాయం కోసం షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. వీటి తరహాలోనే మున్సిపల్ అధికారులు కూడా షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు.



మల్లెచెట్టు చౌరస్తాలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

ఆదాయ వనరులు పెంచుకుంటున్నాం..



మున్సిపల్‌కు వచ్చే ఆదాయంతోపాటు అదనపు ఆదాయ వనరుల కోసం ప్రయత్నం చేస్తున్నాం. మున్సిపల్ షాపింగ్ నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో రెండు చోట్ల దాదాపు 30 గదులతో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించబోతున్నాం. టెండర్ల ద్వారా గదులను కేటాయిస్తాం.

– మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్

బయటకు రాలేకపోతున్నాం..

- లోపించిన పారిశుద్ధ్య నిర్వహణ
- చెత్తాచెదారంతో నిండిన కాలువలు
- పట్టించుకోని అధికారులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపించింది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న పెద్ద మురుగు కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయినా తొలగించడం లేదు. దీంతో దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభిస్తున్నాయని, అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా పలు వార్డుల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి పందులకు ఆవాసాలుగా మారాయి. దీంతో దుర్వాసనతో బయటకు రాలేని పరిస్థితి నెలకొందని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాత బస్టాండ్ వద్ద చెత్తాచెదారంతో నిండిపోయిన మురుగు కాలువ

స్థానిక రిజర్వేషన్లలో ఓసీలకు అన్యాయం



మాట్లాడుతున్న రెడ్డి సంఘాల నాయకుడు

రెడ్డి సంఘాల నేత మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రిజర్వేషన్ల ప్రక్రియలో ఓసీలకు అన్యాయం జరిగిందని మండల రెడ్డి సంఘాల కన్వీనర్ జొగ్రిగాల మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అయినాపూర్‌లో రెడ్డి సంఘాల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఓసీలు అధికంగా ఉన్న గ్రామాలలో బీసీలకు కేటాయించి, బీసీలు అధికంగా ఉన్న గ్రామాలలో ఓసీలకు రిజర్వు చేశారన్నారు. రిజర్వేషన్ల ప్రక్రియ తప్పుల తడకగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి సవరించాలని సూచించారు. ఓసీలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దండ్యాల మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, పులిందర్‌రెడ్డి, వల్లపు రెడ్డి, బాల్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ దసరా ఉత్సవం



ఉత్సవాల్లో స్వయం సేవకులు

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని చంద్లాపూర్‌లో దసరా ఉత్సవం నిర్వహించారు. జిల్లా సహ కార్యవాహ తిరుపతి మాట్లాడుతూ హెగ్డేవార్ స్థాపించిన ఆర్‌ఎస్‌ఎస్ దసరా నాటికి 100 వసంతత్సరాలు పూర్తి చేసుకుంటుందన్నారు. వ్యక్తిత్వ నిర్మాణం, సమాజ సేవ, దేశ సేవకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రాజశేఖర్, దీపక్, సంతోష్, శ్రీకాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోదూరు(సిద్దిపేట):

సంక్షిప్త వార్తలు

◆ 'కీర్తిరత్న'కు అభినందనలు

బెజ్జంకి(సిద్దిపేట): కీర్తిరత్న అవార్డు గ్రహీత, సీనియర్ జర్నలిస్ట్ ఎస్‌వీ రమణాచారిని పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, అక్షర గణిత సమ్రాట్ పుల్లూరి ప్రభాకర్, ప్రొఫెసర్లు బ్రహ్మానందం, మధన్‌మోహన్ మంగళవారం అభినందించారు. భవాని సాహిత్య వేదిక, చొడూరి కళాపీఠం ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రచయితలు, కవులు పాల్గొన్నారు.

◆ సింగూరుకు పోటెత్తిన వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు అక్కడి బ్యారేజీలు నిండి మిగతా నీళ్లన్నీ మంజీరా నది గుండా సింగూరు డ్యాంలోకి చేరుతున్నాయి. మూడు రోజుల నుంచి డ్యాంలోకి లక్ష క్యూసెక్కుల నీరు చేరుతుంది. దీంతో 11 గేట్లు రెండు మీటర్లు మేర ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. మంగళవారం డ్యాంలోకి 1,65,33 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా అంతే నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు వద్ద పర్యాటకులు సందడి చేస్తున్నారు.

◆ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి
ఎస్‌ఐ ఆంజనేయులు

పటాన్‌చెరుటౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని రేణుకఎల్లమ్మ కమాన్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిరోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, అలాగే, రాంగ్ రూట్‌లో వాహనాలు డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


పందుల బెడద నివారించండి

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో నెలకొన్న పందుల బెడదను నివారించాలని రైతులు అధికారులకు విన్నవించుకున్నారు. బెజ్జంకిలో మంగళవారం పలువురు రైతులు విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ పంటలపై పందులు పడి ధ్వంసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వేసిన రెండెకరాల మొక్కజొన్న చేనును పందులు నాశనం చేశాయని రైతు ఐలేని రమేశ్‌రెడ్డి వాపోయారు. అధికారులు స్పందించి పందుల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

3న దేశవ్యాప్త బంద్

సిద్దిపేటకమాన్: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాలను వ్యతిరేకిస్తూ 3న దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు జేఏసీ అధ్యక్షుడు హఫీజ్‌అబ్దుల్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ ఆస్తులు, ముస్లిం మత, సామాజిక, విద్య విషయాల్లో రాజ్యాంగం కల్పిస్తున్న హక్కుల విషయంలో ఇతరుల జోక్యం సరికాదన్నారు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికే బంద్‌కు పిలుపునిస్తున్నామన్నారు. సమావేశంలో కలీం, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వీడ్కోలు



రాజిరెడ్డికి మెమెంటో అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్

దుబ్బాకటౌన్: ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లుగారి రాజిరెడ్డి పదవీ విరమణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సందర్భంగా ఆయనకు కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది మెమెంటో అందజేసి, శాలువాతో సత్కరించారు. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌చార్జి శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో పరిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. దసరా పండుగ నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పరిశుద్ధ్య పనులపై దృష్టి సారించారు. ప్రధాన వీధుల్లో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలగించడంతో పాటు మురికి కాల్వలను శుభ్రం చేయిస్తున్నారు.



తొగుట మండలం కాన్గల్‌లో దుర్గామాతకు కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కనకదుర్గమ్మ.. కరుణించవమ్మ..

దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అన్ని గ్రామాలు, పట్టణాలలోని ఆలయాలు, మండపాల వద్ద మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. నిర్వాహకులు, అర్చకులు ఆ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



నంగునూరు(సిద్దిపేట): పాలమాకుల వేంకటేశ్వరాలయంలో సుహాసిని పూజ



మిరుదొడ్డి(దుబ్బాక): సిద్ధిదాత్రి అలంకరణలో ..



చిన్నకోడూరు(సిద్దిపేట): మల్లారంలో ..



దుబ్బాకటౌన్: కుంకుమార్చన..



చేర్యాల(సిద్దిపేట): ఆకునూరు భవాని రుద్రేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు





హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

ఏసీపీ రవీందర్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దసరా పండుగను పురస్కరించుకుని ఆలయాల వద్ద ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఏసీపీ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రంగదాంపల్లి హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరా పండుగ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రంగదాంపల్లి హనుమాన్ ఆలయం, నర్సాపూర్ హనుమాన్ ఆలయం, రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా వద్ద ఉన్న హనుమాన్ ఆలయం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆయన వెంట త్రీ టౌన్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్లు విద్యాసాగర్, ఉపేందర్, ఆలయ నిర్వాహకులు ఉన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

దసరా పండుగ సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ నిర్వాహకులకు సూచించారు. నర్సాపూర్ హనుమాన్ ఆలయం, రంగదాంపల్లి హనుమాన్ ఆలయాల వద్ద నిర్వహించనున్న ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని, అధికారులు, ఆలయ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు అభినందనలు



మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుస్నాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. అనంతరం హన్మకొండలోని సతీశ్‌కుమార్ నివాసంలో ఆయనను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, మాజీ వైస్ చైర్ పర్సన్ అనిత, మాజీ ఎంపీపీ వెంకట్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, నాయకులు తిరుపతిరెడ్డి, వెంకట్రాంరెడ్డి, గంగం మధు, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. వెళ్లేదెట్లా?

- ప్రమాదాల బారిన వాహనదారులు
- దృష్టిసారించని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

దుబ్బాకటౌన్: కురుస్తున్న వర్షాలకు రహదారులు ధ్వంసం కావడంతో వాహనదారుల ఇక్కట్లు అన్నీ ఇన్నీకావు. దుబ్బాక పట్టణం నుంచి హబ్సీపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో రామసముద్రం చెరువు కట్ట సమీపంలో కిలోమీటర్ల మేర రహదారిపై గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. చీకట్లో గుంతలు ఎక్కడున్నాయే తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దపెద్ద గుంతలు

అసలే వానాకాలం కావడంతో గుంతల్లో నీరు నిలుస్తున్నాయి. దీంతో ఏదీ అసలైన గుంతో తెలియక వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అడుగడుగునా గుంతలతో ప్రమాదాల బారిన పడి చేతులు, కాళ్లకు గాయాలవుతున్నా అధికారులు స్పందించకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



దుబ్బాక - హబ్సీపూర్ వెళ్లే ప్రధాన రహదారిలో పెద్ద పెద్ద గుంతలు

